క్లుప్తంగా

యూరియా కోసం రైతుల పడిగాపులు



కొణిజర్ల సొసైటీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కొణిజర్ల: యూరియా బస్తాల కోసం రైతులు ఆందోళనకు దిగిన ఘటన శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. కొణిజర్ల మండలంలోని పలు గ్రామాల్లో గిట్టుబాటు కావడం లేదని యూరియా అమ్మకాలను ప్రైవేట్ డీలర్లు నిలిపివేశారు. దీంతో సొసైటీ ద్వారా అమ్మకాలు జరపాలని అధికారులు నిర్ణయించారు. ఈమేరకు గోపవరం వ్యవసాయ సహకార పరపతి సంఘంలో స్టాక్ దించగా, ఇటీవల వర్షాలతో రైతులు యూరియా కోసం సొసైటీ కార్యాలయానికి వచ్చారు. అయితే, అందరికీ సరిపడా స్టాక్ లేదని సిబ్బంది చేతులెత్తేశారు. దీనికి తోడు యూరియా కావాలంటే కాంప్లెక్స్ ఎరువు కొనాలని కొర్రీలు పెడుతున్నారంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి అన్ని రకాల యూరియా సమకూర్చాలని కోరారు.

అశ్విని కుటుంబానికి ఎంపీ ఈటల పరామర్శ



అశ్విని చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఈటల, నాయకులు

కారేపల్లి: మండలంలోని గంగారంతండాకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత డాక్టర్ నూనావత్ అశ్విని, ఆమె తండ్రి మోతీలాల్ ఆకేరులో వరదలో గల్లంతై మృతి చెందగా వారి కుటుంబాన్ని ఎంపీ ఈటల రాజేందర్ శుక్రవారం పరామర్శించారు. జాతీయ గిరిజన కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్‌నాయక్‌తో కలిసి ఆయన అశ్విని, మోతీలాల్ చిత్రపటాల వద్ద నివాళులర్పించి మాట్లాడారు. రాయపూర్‌లోని ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్‌లో శాస్త్రవేత్తగా పనిచేసిన అశ్విని పేరిట రావాల్సిన బెనిఫిట్స్ మంజూరు చేయిస్తానని తెలిపారు. మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, నాయకులు వెంకటేశ్వర్లు, వైవీ.రావు, వెంకన్న, నరసింహా, శంకర్‌నాయక్, మల్లేష్ యాదవ్, రాంప్రసాద్, సుజాత, రాంబాబు, సురేష్ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలి

బోనకల్: రిటైర్డ్ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యనమద్ది వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. బోనకల్‌లో శుక్రవారం ఆయన మట్లాడుతూ గత మార్చిలో రిటైర్డ్ అయిన టీచర్లకు బెనిఫిట్స్ ఇప్పటివరకు ఇవ్వకపోవడం సరికాదన్నారు. కాగా, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు విజయవంతం నిర్వహించడమే కాక ప్రభుత్వ స్కూళ్లకు ఉచిత విద్యుత్ అమలుచేస్తుండడం శుభపరిణామమని తెలిపారు. ఈ సమావేశంలో పీఆర్‌టీయూ నాయకులు పుట్లూరి వెంకటేశ్వ రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ నగదు ఇవ్వాలని డిమాండ్

చింతకాని: ప్రభుత్వం విడుదల చేసిన రుణమాఫీ నగదు చెల్లించాలని మహిళా రైతు బ్యాంక్ అధికారులను నిలదీసింది. రైతు చెమట ఉష తెలిపిన వివరాల ప్రకారం.. ముదిగొండ మండలం గంధసిరికి చెందిన ఆమెకు చింతకాని తిమ్మినేనిపాలెంలో తల్లిదండ్రులు పసుపు కుంకుమ కింద 15 ఏళ్ల క్రితం 3.20 ఎకరాల వ్యవసాయ భూమి ఇచ్చారు. ఆమె నాగులవంచ ఏపీజీవీలో పంట రుణం తీసుకుంటోంది. ఇటీవల ఉషకు రూ.1.40 లక్షలు నాగులవంచ ఏపీజీవీలో, భర్త వెంకటేశ్వర్లుకు రూ.30 వేలు ముదిగొండ సొసైటీలో మాఫీ అయిందని అధికారులు చెప్పగా వెంకటేశ్వర్లు వారం క్రితమే నగదు తీసుకున్నాడు. ఆపై ఉషతో శుక్రవారం నాగులవంచ ఏపీజీవీకి రాగాఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకంలో ఇంటి పేరు వేరుగా ఉన్నందున నగదు ఇవ్వలేదని తెలిపారు. దీంతో వారు అధికారులను నిలదీయగా పేర్లు సరిచేసుకుంటేనే ఇస్తామని స్పష్టం చేయడంతో వెనుదిరిగారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం

వైరా: వైరా గ్రేట్ విజన్ లయన్స్‌క్లబ్ వారి ఆధ్వర్యంలో సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం 15మంది ప్రభుత్వ ఉపాధ్యాయులను గ్రేట్ విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తోటకూర శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అనంతరం లయన్ డాక్టర్ శ్రీధర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని.. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న ఏన్కూరుకు చెందిన నాగలక్ష్మికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పీడీజీ డాక్టర్ కాపా మురళీ కృష్ణ, జీఎస్‌టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఉండ్రు శ్యాంబాబు, లగడపాటి ప్రభాకర్ రావు, శివప్రసాద్, కిషన్‌రాయ్, పుల్లారావు, రామకృష్ణ, రవీంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇంటి ఎదుట నిలిచిన బురదనీరు



పారిశుద్ధ్య పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్న కాలనీ వాసులు

పారిశుద్ధ్యంపై పట్టింపేది..?

- బురదమయంగా మారిన కాలనీలు
- అవస్థలు పడుతున్న ముంపుప్రాంతాల ప్రజలు
- పట్టించుకోని అధికారులు

వేంసూరు: వేంసూరు మండలంలో పారిశుద్ధ్యం పడకేసింది. ఏ కాలనీలో గానీ.. గ్రామంలో గానీ చూసినా నీరు, బురద, చెత్తకుప్పలే దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ముంపు ప్రాంతాల్లోని ప్రజల ఇళ్లల్లోకి నీరు చేరడంతో పాటు పరిసర ప్రాంతాలన్నీ బురదమయంగా మారింది. అయినా.. అధికారులు మాత్రం ఇటువైపు కన్నెత్తికూడా చూడడం లేదని కందుకూరు ఎస్సీకాలనీ వాసులు వాపోతున్నారు. వరద తగ్గినా ఇళ్లలో బురద కారణంగా కాలు తీసి వేయలేని దుస్థితి నెలకొంది. ఇళ్లు శిథిలావస్థలకు చేరుకున్నాయి.

పారిశుద్ధ్య చర్యలు శూన్యం..

కందుకూరు ఎస్సీ కాలనీలో వరదతో ముంపుకు గురైన అధికారులు కనీస పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంలేదని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. ఇళ్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో మురుగు నీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతున్నాయని, రాత్రి వేళల్లో పాములు చేరుతున్నాయని భయభ్రాంతులకు గురవుతున్నారు. కనీసం బ్లీచింగ్ కూడా చల్లడంలేదని అంటున్నారు. గ్రామంలో రాహదారుల వెంట డ్రెయినేజీల లేకపోవడంతో రోజులుగా మురుగనీరు రోడ్డుపై నలిచిఉంటుంది. జీపీ అధికారులకు పట్టకపోవడంతో మురుగులో దోమలు పెరిగి ఇబ్బందులు పెడుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. చెత్తకుండిల్లోని చెత్తను రోజుల తరబడి అలాగే ఉండటంతో దోమలు, ఈగలకు నిలయాలుగా మారాయని.. ఏ రోజు చెత్తను ఆ రోజే తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



ఇంటి లోపల ఉన్న నీటిని చూపుతున్న వృద్ధురాలు

అధికారులు దృషి సారించాలి..



కందుకూరు ఎస్సీ కాలనీలో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యపై అధికారులు దృష్టి సారించి సమస్యను పరిష్కరించాలి. బ్లీచింగ్ చల్లి.. ఫాగింగ్ చేపట్టాలి. వ్యాధులు భారిన పడకుండా చర్యలు తీసుకోవాలి.

– పుల్లమ్మ, కందుకూరు ఎస్సీ కాలనీ

డ్రెయినేజీలు నిర్మించాలి..



కాలనీలో అంతర్గత రహదారులకు డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షం పడిన ప్రతీసారి ఇళ్లలోకి నీరు చేరుతుంది. మురుగునీరు నిల్వ ఉంటుంది. దీనిపై అధికారులు చర్యలు చేపట్టి.. సైడ్ కాలువలు నిర్మాణం చేపట్టాలి.

– వెంకటరమణ, కందుకూరు ఎస్సీ కాలనీ

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు

కారేపల్లి: వైరా నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నట్లు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ అన్నారు. శుక్రవారం కారేపల్లి వైఎస్ఎన్ గార్డెన్‌లో 87మంది లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందించి మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని ఎవరు చెడగొట్టలేరని, ఎవరైనా చెడగొట్టాలని చూస్తే వారే చెడిపోతారన్నారు. స్థానిక నాయకులు ఒకరిపై ఒకరు ఈర్షపడొద్దని, నాకు దగ్గరగా ఉన్నవారైనా.. దూరంగా ఉన్నావారైనా అందరూ సమానమేనని, పక్షపాతం లేదన్నారు. నాతో పాటుగా అందరూ అభివృద్ధికి సహకరించాలన్నారు. జిల్లాలో 10 నియోజక వర్గాలు ఉంటే, 9 నియోజక వర్గాలతో పోటీ పడుతున్నానన్నారు. ఇదివరకు చీమలపాడులో గ్యాస్‌పేలుడు గటనలో నలుగురు చనిపోతే అప్పటి సీఎం రాలేదని.. కానీ ఆకేరు దుర్ఘటనలో మృతి చెందిన సైంటిస్ట్ అశ్విని, ఆమెతండ్రి మోతీలాల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారన్నారు. కాంగ్రెస్ ప్రజల ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి తహసీల్దార్ సంపత్‌కుమార్, ఏఓ అశోక్, కాంగ్రెస్ పార్టీ రాష్ట మహిళా ఉపాధ్యక్షురాలు మంజుల, మాజీ ఎంపీపీ దేవ్లా నాయక్, ఐలయ్య యాదవ్, మండల అధ్యక్షుడు చంద్రప్రకాశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

ఏన్కూరు: మండలంలోని మూలపోచారం ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గరికి శ్రీనివాస్ ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడంతో గురువారం భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలో పీఓ బి.రాహుల్ ఆయనను సన్మానించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులకు గిరిజన సంక్షేమ విభాగం భద్రాచలం వారు నిర్వహించిన విద్యకు సంబందించి 23 అంశములతో పాటు పాఠశాలల అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అనే అంశంపై గరిక శ్రీనివాస్ డాక్యుమెంట్ రచన చేసినందుకు ఉత్తమ డాక్యుమెంట్ రచనగా ఖమ్మం జిల్లా నుంచి ఎంపికైంది. ఉపాధ్యాయ అవార్డుతో పాటు డాక్యుమెంట్ క్యాస్ అవార్డు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ జయరాజు, హెచ్ఎం, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌ను సన్మానించారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

వైరారూరల్: ప్రతి సీపీఎం కార్యకర్త అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు అన్నారు. మండలంలోని విప్పలమడకలో శుక్రవారం గరిడేపల్లి వెంకటేశ్వరరావు 19వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించి ఆయన స్మారక స్తూపం వద్ద ఘన నివాళులర్పించారు. మాజీ సర్పంచులు జాన్‌పాపయ్య, కృష్ణారావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, వెంకటచారి పాల్గొన్నారు.

మృతులకు నివాళి

ముదిగొండ: మండలంలోని వనంవారికిష్టాపురానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కోయ శ్రీనివాసరావు (45) అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రాష్ట గిడ్డంగుల చైర్మన్ నాగేశ్వరరావు సందర్శించి, పార్టీ జెండా కప్పి, పూలదండ వేసి నివాళులు అర్పించి కుటుంబాన్ని ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో నాయకులు అజయ్, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వరరావు, తిరుపతిరావు, వెంకట్రావు ఉన్నారు.

దండు పాపయ్యకు ఎమ్మెల్యే..

సత్తుపల్లిరూరల్: మండలంలోని రామానగరానికి చెందిన దండు పాపయ్య అనారోగ్యంతో మృతి చెందటంతో ఆయన పార్థివ దేహానికి శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం



వైరా: ఖమ్మం తరలించడానికి ప్యాకెట్లు సిద్ధం చేస్తున్న సీపీఎం నాయకులు

వైరా: ఖమ్మం మున్నేరు వరద బాధితులకు సీపీఎం వైరా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో వస్తు రూపంలో సేకరించిన విరాళాలను ఖమ్మం తరలించి పంపిణీ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు, వైరా డివిజన్ నాయకులు సుంకర సుధాకర్, చింతనిప్పు చలపతిరావు, సుజాత, రామకృష్ణ, వివేక్, రాజేష్, వినయ్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ..



మధిర: నిత్యావసర సరుకులు అందిస్తున్న కౌన్సిలర్ మల్లాది వాసు

మధిర: మధిర పట్టణంలో ముంపునకు గురైన వరద బాధితులకు కాంగ్రెస్ పార్టీ, మల్లాది సేవా ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మల్లాది వాసు మాట్లాడుతూ.. మధిర పట్టణ ప్రజలకు ఏ కష్టం వచ్చినా కాంగ్రెస్ పార్టీ, మల్లాది సేవా ట్రస్ట్ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, సరుకులు..

చింతకాని: వరద బాధితుల సహాయార్థం మండలంలోని నేరడ గ్రామానికి చెందిన చెవుల తిరుపతిరావు, అతని కుమారుడు పవన్ ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం తిరుపతిరావు రూ.5 వేలు, అతని కుమారుడు దాచుకున్న రూ.1,050 నగదును తహసీల్దార్ అనంతరాజుకు అందజేశారు. అలాగే లచ్చగూడెంలో వరద బాధితుల కోసం గ్రామ యువకులు సేకరించిన దుస్తులు, నిత్యావసరాలను వరద బాధితులకు అందజేశారు. అలాగే భోజన ప్యాకెట్లను కూడా పంపిణీ చేశారు. కార్యక్రమంలో లచ్చగూడెం గ్రామ యువకులు వినయ్, దామోదర్, సైదులు, వెంకట్రావు, వంశీ, విజయ్, చాణక్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిరాశ్రయులైన కుటుంబాలకు అన్నదానం

తల్లాడ: మండలంలోని కొడవటిమెట్ట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ బద్దం నిర్మల, బీఆర్ఎస్ నాయకులు బద్దం కోటిరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం చేశారు. ఖమ్మంలోని ముత్యాలమ్మ గుడి బజార్లో పలు కుటుంబాలకు అన్నదానం చేశారు. పులిహోర ప్యాకెట్లను కూడా అందజేశారు. తల్లాడకు చెందిన పాస్టర్ ఇశ్రాయేలు బాధితులు 30మందికి దుప్పట్లు పంపిణీ చేశారు.

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

మధిర: మధిర, ఎర్రుపాలెం మండలాల్లో ఏర్పాటు చేస్తున్న గణేష్ మండపాలకు విద్యుత్ దీపాలంకరణకు ఉచిత విద్యుత్‌ను అందజేయనున్నట్లు విద్యుత్ శాఖ మధిర సబ్ డివిజన్ ఏడీఎం. అనురాధ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత విద్యుత్ పొందాలనుకునే కమిటీ సభ్యులు విద్యుత్ శాఖ వారు నిర్దేశించిన నమూనా పత్రం నందు గణేష్ మండప వివరాలను పొందుపరుస్తూ సంబంధిత ఏఈ కార్యాలయం నందు అందజేయాలని సూచించారు.

రైతులను ఆదుకోవాలి

కొణిజర్ల: ఇటీవల వచ్చిన వరదల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.30 వేలు చొప్పున నష్టపరిహారం అందజేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ అనుబంధ రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు షేక్.ఖాసీమ్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం ఆ సంఘం నాయకులు మండలంలోని గుబ్బగుర్తి, సింగరాయపాలెం, అంజనాపురం, గద్దలగూడెం ఉప్పలచలక, విక్రమ్‌నగర్, సాలెబంజర గ్రామాల్లో పర్యటించి పంటలు పరిశీలించారు. కార్యక్రమంలో చీకటి మోహన్‌రావు, గుగులోత్ బాబు, గాలి నరసింహారావు పాల్గొన్నారు.

పిల్లలకు వైద్యపరీక్షలు



పోషకాహార లోపంతో ఉన్న పిల్లలకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు

కల్లూరురూరల్: కల్లూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఐసీడీఎస్ సీడీపీఓ తిరుమల జ్యోతి శుక్రవారం సందర్శించారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో డాక్టర్ నవ్యకాంత్, డాక్టర్ అఖిల ఆధ్వర్యంలో పోషకాహార లోపంతో బలహీనంగా ఉన్న పిల్లలను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఎన్ఆర్సీకి రిఫర్ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుజాత, వెంకటమ్మ, భవాని, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చవితి సందడి..



వైరా: విగ్రహాన్ని తరలిస్తున్న భక్తులు

వినాయక చవితి పర్వదినాన్ని శనివారం జరుపుకునేందుకు పత్రి, వినాయక ప్రతిమలు, పాలవెల్లి, పూలు, పూజా సామగ్రి కొనుగోళ్లతో మార్కెట్ రద్దీగా మారింది. జోరు వర్షంలోనూ అమ్మకాలు సాగించారు. వాడవాడల వినాయక ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. అదే విధంగా తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని పోలీస్ వారి హెచ్చరికల నేపథ్యంలో ఉత్సవ కమిటీ సభ్యులు నెట్ సెంటర్ల వద్ద బారులు తీరారు.

– సాక్షి నెట్‌వర్క్



సత్తుపల్లిటౌన్: ఉచితంగా మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేస్తున్న మాధురి మధు



సత్తుపల్లిరూరల్: వాసవీగణపతి ఆధ్వర్యాన మట్టి ప్రతిమలను అందజేస్తున్న ఏసీపీ రఘు



తల్లాడ: కొత్త మిట్టపల్లిలో ముస్తాబైన మండపం

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన అధికారులు



బోనకల్: పత్తిపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సంచాలకుడు విజయచంద్ర



తల్లాడ: కుర్నవల్లిలో పత్తిపంటను పరిశీలిస్తున్న ఏఓ తాజుద్దీన్

బోనకల్: మండలంలో దెబ్బతిన్న పంటపొలాలను మధిర వ్యవసాయ సంచాలకుడు ఎస్ విజయచంద్ర పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణాధికారులు పాల్గొన్నారు.

పత్తిపైరును పరిశీలించిన ఏఓ..

తల్లాడ: భారీ వర్షాల కారణంగా మునిగిన పంటలను శుక్రవారం ఏఓ ఎండీ తాజుద్దీన్, ఏఈఓలు పరిశీలించారు. మండలంలోని కుర్నవల్లి, తల్లాడ, పినపాక గ్రామాల్లో దెబ్బతిన్న పెసర, పత్తి, వరిపైర్లను పరిశీలించారు. ఇంకా పత్తి చేలల్లో వరద నీరు ఉందని.. దీంతో పత్తిపూత రాలడంతోపాటు పిందె నల్లబడిందన్నారు.

కారేపల్లి సంత బహిరంగ వేలం



సంత బాధ్యతలను స్రవంతికి అప్పగిస్తున్న ఆలయ ఈఓ శేషయ్య

కారేపల్లి: కారేపల్లి వారాంతపు సంత బహిరంగ వేలం పాటను దేవాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామి సమక్షంలో నిర్వహించారు. శుక్రవారం బహిరంగ వేలం నిర్వహించగా నలుగురు వ్యక్తులు రూ.50వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. కాగా.. సింగరేణి మాజీ సర్పంచ్ ఆదెర్ల స్రవంతి–ఉపేందర్ దంపతులు పాల్గొని, రూ.5.30లక్షలకు వేలంపాడి సంతను దక్కించుకున్నారు. నిభందనల ప్రకారం సగం నగదును చెల్లించి ఆలయ అధికారుల నుంచి సంత నిర్వహణ భాద్యతలను స్వీకరించారు. మిగతా నగదును మూడునెలల అనంతరం చెల్లించాల్సి ఉంటుందని సంతగుడి కార్యనిర్వాహణ అధికారి నల్ల మోతు శేషయ్య తెలిపారు. వేలంలో గుడెల్లి శ్రీనివాసరావు, అశోక్‌బూబ్, పెద్దమ్మ కృష్ణ పాల్గొనగా.. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మూడ్ మోహన్ చౌహాన్, ఉప సర్పంచ్ మధు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కాకర్లపల్లిలో పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

సత్తుపల్లి: మండలంలోని కాకర్లపల్లిబోడు కాలనీలో గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యాన శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వర పీడితులతో పాటు దగ్గు, జలుబు, షుగర్, బీపీ రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం మంజుల, ఆశా కార్యకర్తలు జయమ్మ, కుమారి పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: సింగరేణి కొత్తగూడెం జనరల్ మేనేజర్ ఎం.షాలేంరాజు ఆదేశాల మేరకు జేవీఆర్ ఓసీ పీఓ ప్రహ్లాద్, కిష్టారం ఓసీ పీఓ బి.నర్సింహారావు ఆధ్వర్యంలో శుక్రవారం జేవీఆర్ ఓసీ డిస్పెన్సరీ వైద్య సిబ్బంది ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 47 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ డి.శిరీష, సంక్షేమాధికారి కె.దేవదాస్, వైద్య సిబ్బంది లక్ష్మి పాల్గొన్నారు.

చింతకాని: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ తెలిపారు. మండలంలోని లచ్చగూడెం, అనంతసాగర్, తిరుమలాపురం, నాగులవంచ గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యసిబ్బంది శుక్రవారం వైద్య శిబిరాలను నిర్వహించారు. రోగులను పరీక్షించి మందులను అందించారు. అలాగే గ్రామాల్లో చేపట్టిన డ్రైడే కార్యక్రమాలను పర్యవేక్షించారు. మురుగు నీటి నిల్వలో బ్లీచింగ్ చల్లి దోమల నివారణ మందును పిచికారీ చేశారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన డాక్టర్ వెంకటేశ్వర్లు, వేణుమాధవ్, భవ్య, సీహెచ్‌ఓ వీరేందర్, హెల్త్ సూపర్‌వైజర్లు రేఛల్‌రాణి, జ్యోతిరత్న ఏఎన్ఎంలు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



ఏన్కూరు: పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

ఏన్కూరు: పౌష్టికాహారంతోనే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి అన్నారు. మండలంలోని హిమామ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆమె సందర్శించి.. చిన్నారుల ఎత్తు, బరువును పరిశీలించారు. గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

వైరారూరల్: మండలంలోని రెబ్బవరం అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ్ మాసోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్.బీజానీబీ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు కంచర్ల భాగ్యలక్ష్మి, కె.రోహిణి, కె.అన్నపూర్ణ, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు

సత్తుపల్లిటౌన్/సత్తుపల్లిరూరల్: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉన్న ఆహారం ప్రతి తీసుకోవటం వల్ల ఆరోగ్యవంతంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు యు.మహాలక్ష్మి, గంగాజలం అన్నారు. సత్తుపల్లి, నారాయణపురం గ్రామాల్లో శుక్రవారం పోషణ్‌అభియాన్ కార్యక్రమాలు నిర్వహించారు. పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సునీత, రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు మంగతాయారు, రహ్మతున్నీసా, స్వాతి, అరుణ, రజని, రమాదేవి, తాయారు, శిరోమణి, చిలకమ్మ, హెచ్ఎం శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.



వేంసూరు: గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

వేంసూరు: పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా వేంసూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో సత్తుపల్లి ప్రాజెక్ట్ సీడీపీఓ కనకదుర్గ పోషకాహారంపై అవగాహన కల్పించి.. గర్భిణులకు సీమంత వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ కమల, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



వైరారూరల్: మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీజానీబీ



సత్తుపల్లిరూరల్: నారాయణపురంలో పోషకాహార ప్రదర్శనలో సూపర్‌వైజర్ గంగాజలం

తల్లాడ: తల్లాడ ఎన్టీఆర్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసోత్సవాల కార్యక్రమంలో సీడీపీఓ కల్లూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సీహెచ్.నిర్మలజ్యోతి అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీకి, సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎండి.మహబూబ్ వలీ, సూపర్‌వైజర్ రోజా, కరుణ, సత్యావతి, అంగన్‌వాడీ టీచర్ శైలజ, రఫియా, ఎఎన్ఎం వీరకుమారి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.